క్లుప్తంగా

చుక్కల దుప్పిని కాపాడిన స్థానికులు

చంద్రగిరి: అడవి నుంచి తప్పిపోయి ఐతేపల్లిలోకి వచ్చిన చుక్కల దుప్పిని ఆదివారం కుక్కల బారి నుంచి స్థానికులు కాపాడారు. దీనిపై సర్పంచ్ భర్త అంజద్ ఖాన్ మాట్లాడుతూ చుక్కల దుప్పి అడవి నుంచి తప్పిపోయి గ్రామంలోకి వచ్చిందన్నారు. దాన్ని కుక్కలు వెంటాడుతుండగా రక్షించినట్టు పేర్కొన్నారు. దానికి ప్రథమ చికిత్సను అందించి తిరుపతి జూపార్కు అధికారులకు సమాచారం చేరవేశామన్నారు. అటవీశాఖ అధికారులు దుప్పిని స్వాధీనం చేసుకుని సురక్షితంగా అడవిలో వదిలిపెట్టారు. ఈ సందర్భంగా అటవీ అధికారులు గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

పాకాల: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతి నవజీవన్ కంటి ఆస్పత్రి వైద్యులు 64 మందికి కంటి పరీక్షలు చేశారు. 17 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసి తిరుపతిలోని నవజీవన్ కంటి ఆస్పత్రికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రఘునాథనాయుడు, కార్యదర్శి మారసాని విజయబాబు, జీఎంటి మెంబర్ ఆర్వీ ప్రసాద్, డీసీ రామయ్య, గురుస్వామినాయుడు, జయరామనాయుడు, కుప్పుస్వామినాయుడు, దొరస్వామినాయుడు, ఆర్గనైజర్ విజయభారతి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని ఆదివారం డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఎం సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసులు, సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్, సీనియర్ ఐఏఎస్ అధికారి శ్రీనివాసులురాజు, ప్రముఖ హీరోయిన్ శ్రేయ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

ఐకమత్యంతోనే దళితుల అభివృద్ధి

పాకాల: ఐకమత్యంతోనే దళితులు అభివృద్ధి చెందుతారని అంబేడ్కర్ భవన్ కమిటీ అధ్యక్షుడు ఆనందయ్య తెలిపారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో న్యాయమూర్తి గుర్రప్ప, సీనియర్ పాత్రికేయులు నాగరాజు, ఆర్‌పీఐ నాయకుడు అంజయ్య పాల్గొని మాట్లాడారు. దళితులు ఐక్యమత్యంతో ఉంటూ హక్కులను సాధించుకోవాలని, అంబేడ్కర్ ఆశయాలను ప్రచారం చేయాలని సూచించారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. ఉత్సవ నిర్వహణ కమిటీని ఏర్పాటు చేశారు.

కాస్ట్యూమ్ కృష్ణకు రంగస్థలి నివాళి



క్యాస్ట్యూమ్ కృష్ణ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న రంగస్థలి ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ప్రముఖ నటుడు, నిర్మాత, కాస్ట్యూమ్ డిజైనర్ కృష్ణకు రాయలసీమ రంగస్థలి ప్రతినిధులు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ భారత్ బంద్ సినిమాతో నటుడిగా పరిచయమైన కృష్ణ తనదైన శైలిలో విలనిజం చేసి ప్రేక్షకాదరణ పొందారని కొనియాడారు. కోడి రామకృష్ణ దర్శకత్వంలో అనేక సినిమాల్లో నటించి పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మెప్పించారని కొనియాడారు. ఆయన మృతి సినిమా ప్రపంచానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి సభ్యులు సుబ్రమణ్యం యాదవ్, తిరుపాలాచారి, విజయ్‌కుమార్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, చెంగయ్య పాల్గొన్నారు.

మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు

- మీ బిడ్డగా మీతోపాటే నడుస్తున్నాడు
- జగనన్న మాటకు కట్టుబడి వెళ్తున్నా
- ఆత్మీయ సమ్మేళనంలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి): 'మీ అందరి కళ్ల ముందు పెరిగిన బిడ్డ.. మీ చేయి పట్టుకుని నడిచిన బిడ్డ.. తెలిసీ తెలియక ఏదైనా తప్పుచేసి మీ మనస్సుకు కష్టం కలిగించి ఉంటే పెద్ద మనస్సుతో క్షమించండి.. మీ బిడ్డగా మోహిత్‌రెడ్డిని ఆదరించి ఆశీర్వదించండి.. 2014 ఎన్నికల నుంచి మీతో పాటే గడపగడపకూ తిరుగుతున్నాడు.. తల్లిదండ్రులు నాకు జన్మనిస్తే చంద్రగిరి ప్రజలు రాజకీయ జీవితాన్నిచ్చారు. అందుకే నా కుటుంబం, నా ప్రజలు వేరు కాదనే భావన కలిగింది. ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకునేందుకు శక్తి వంచన లేకుండా పనిచేశాను. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న తనతో పాటు ఉండాలన్న మాటకు కట్టుబడి ప్రత్యక్ష రాజకీయాల నుంచి బయటకు వెళ్తున్నా. 2024 ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ముందుండి నడిపించి విజేతగా తీసుకురావాలి' అని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కోరారు. తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తనను నమ్ముకుని, తనతో పాటు ప్రయాణించిన నాయకులు, కార్యకర్తల కష్టాన్ని మరిచిపోలేనని, చంద్రగిరి నుంచి రాష్ట్ర స్థాయి నాయకుడిగా తనకు గుర్తింపు వచ్చిందంటే అది మీరు పెట్టిన భిక్ష అని చెవిరెడ్డి స్పష్టం చేశారు. రాజకీయంగా తన కుటుంబంపై విశ్వాసం చూపించిన పార్టీ నేతలు, కార్యకర్తలకు రుణపడి ఉంటానని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో పార్టీ అనుబంధ సంఘాలను బలోపేతం చేయడం, ఎన్నికల నిర్వహణ బాధ్యతలు తీసుకోవాల్సి ఉన్నందున సీఎం జగనన్నకు అతి దగ్గరగా వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అందుకే సీఎం జగనన్న సూచనల మేరకు మోహిత్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

మోహిత్‌ని మీ బిడ్డగా ఆదరించండి

మీ కళ్ల ముందు పెరిగిన తన బిడ్డ చెవిరెడ్డి మోహిత్‌ను మీ బిడ్డగా ఆదరించాలని చెవిరెడ్డి పార్టీ శ్రేణులకు విన్నవించారు. ఇప్పటికే మహా పాదయాత్రలో భాగంగా గడపగడపకూ వెళ్లి మోహిత్‌ను ప్రజలకు పరిచయం చేసినా ఇకపై మరింతగా జనం మధ్యకు తీసుకుని వెళ్లాలని సూచించారు. మీలో ఒక్కడిగా తనకంటే ఎక్కువ జనం గుండెల్లో ఒదిగిపోయే గుణం కలిగిన బిడ్డను కళ్లలో పెట్టుకుని కాపాడుతూ విజయం దిశగా అడుగులు వేయించాలని కోరారు. శత్రువులకు కూడా చెడు చేయకుండా, ప్రతిపక్షాలు సైతం కాదనలేని విధంగా చంద్రగిరిలో అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టించామన్నారు. ఇప్పటి వరకు రూ.430 కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ఇంకా రూ.90 కోట్లను కొత్త అభివృద్ధి పనులకు మంజూరు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పల్లెల్లో రాజకీయ గొడవలు లేకుండా ప్రశాంత వాతావరణం కల్పించిన ఘనత తమకు మాత్రమే దక్కుతుందని, అందుకు సహకరించిన పార్టీ నేతలు, కార్యకర్తలకు అందరికీ చెవిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. చంద్రగిరి ప్రజలకు ఇచ్చిన మాటలు నిలబెట్టుకునేలా పనిచేశానన్న సంతృప్తి కలుగుతోందన్నారు. ఇకపై మోహిత్‌రెడ్డి కూడా ప్రజలకు మరింత దగ్గరగా సేవ చేయడానికి సంసిద్ధంగా ఉన్నాడని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఒక సైనికుడిలా కష్ట పడి ఎంపీపీగా ఉన్న మోహిత్‌ను ఎమ్మెల్యే గెలిపించాలని ఆయన అభ్యర్థించారు.

తెలియక తప్పులు చేస్తే క్షమించండి

చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ మాట్లాడుతూ ఆత్మీయ సమావేశానికి వచ్చిన అందరిముందు తాను చిన్నవాడినని, తెలియకుండా తప్పు జరిగితే క్షమించి మీ బిడ్డగా సర్దుకుపోవాలని విజ్ఞప్తి చేశారు. మీ అందరికిలో ఒక్కడిగా కలిసి పెరిగిన తాను 2014, 2019 ఎన్నికల్లో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గెలుపు కోసం మీ చేయి పట్టుకుని ప్రతి ఇళ్లూ తిరిగానని గుర్తుచేశారు. తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ జగనన్న ఆశయ సాధన కోసం జనం ముందుకు వస్తున్న తనకు బాసటగా నిలవాలని అభ్యర్థించారు. గడపగడపకు మహా పాదయాత్రలో చూపించిన ప్రేమ వెలకట్టలేనిదని తెలిపారు. చంద్రగిరి ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు.

మోహిత్‌పై తగ్గని అభిమానం

వైఎస్సార్‌సీపీ పార్టీ నేతలు, కార్యకర్తల్లో తమ నాయకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై చూపిన ప్రేమ, అభిమానాన్ని మోహిత్‌రెడ్డిపై చూపించారు. చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా చెవిరెడ్డి మోహిత్‌ను ప్రకటించిన తర్వాత వేద పండితులు ఆశీర్వచనం చేశారు. పలువురు సత్కరించి అభినందనలు తెలిపారు. ప్రజల వద్దకు తీసుకెళ్తామని, 2024 ఎన్నికల్లో గెలిపించి జగనన్న కానుకగా అందిస్తామన్నారు.

నేటి నుంచి తెప్పోత్సవాలు

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామి తెప్పోత్సవాలు సోమ, మంగళ, బుధవారాల్లో అత్యంత వేడుకగా నిర్వహించనున్నారు. స్వామి వారు ప్రతి రోజూ రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు శ్రీరామచంద్ర పుష్కరిణిలో తెప్పపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారు. అదేవిధంగా ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు ఆలయ ఆవరణలో సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మొదటి రోజు సీతాలక్ష్మణ సమేత శ్రీరాముల వారు తెప్పలను అధిరోహించి శ్రీరామచంద్ర పుష్కరిణిలో ఐదు చుట్లు విహరించి భక్తులకు దర్శనమిస్తారు. రెండో రోజు ఏడు చుట్లు, చివరి రోజు తొమ్మిది చుట్లు తిరుగుతారు.

మూలస్థాన ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం



దాతలను సత్కరిస్తున్న ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి

చంద్రగిరి: గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్ నిర్మాణానికి ఆదివారం పాతపేటకు చెందిన రాజులగారి చిన్నబ్బ కుమారుడు శంకర్ రెడ్డి రూ.50 వేలు విరాళం ఇచ్చారు. నగదును ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డికి అందజేశారు. వారికి ఆలయ చైర్మన్ అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రామకృష్ణారెడ్డి పాలకమండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగనన్న దళితుల పక్షపాతి

- జగనన్న పాలనలోనే దళితుల అభ్యున్నతి
- దళిత ద్రోహి చంద్రబాబు
- వైఎస్సార్ సీపీ సేవాదళ్ రీజనల్ ఇన్‌చార్జ్ తలారి రాజేంద్ర



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న తలారి రాజేంద్ర

తిరుపతి మంగళం: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దళితుల పక్షపాతి అని, వారు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందడానికి అనేక చర్యలు తీసుకుంటున్నారని వైఎస్సార్ సీపీ సేవాదళ్ రీజనల్ ఇన్‌చార్జ్ తలారి రాజేంద్ర పేర్కొన్నారు. జీవకోనలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాజేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న అధికారంలోకి వచ్చాక దళితులకు ఉన్నత పదవులు ఇచ్చి గౌరవించారని తెలిపారు. దళితుల అభ్యున్నతి, సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన సాగిస్తున్నారని వివరించారు. జగనన్నపై చంద్రబాబు ఎల్లో మీడియాలో పిచ్చిరాతలు రాయిస్తున్నాడని మండిపడ్డారు. దళితులుగా ఎవ్వరైనా పుట్టాలనుకుంటారా? అని చంద్రబాబు హేళనగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులను జగనన్న హింసిస్తున్నారని, దళితులపై దాడు లు చేయిస్తున్నారని ఎల్లో మీడియాలో అబద్ధపు రాతలు రాయిస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్న గెలుపునకు దళితులంతా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు రాజశేఖర్, గీత, వంశీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతికి మరో స్మార్ట్ రోడ్డు

- రూ. 6.3 కోట్లతో నిర్మాణం
- ఆరు నెలల్లోనే అందుబాటులోకి
- 5న ప్రారంభానికి సిద్ధం



తిరుపతి తుడా: ఆధ్యాత్మిక తిరుపతి నగరం స్మార్ట్ సిటీగా అభివృద్ధి వైపు పరుగులు పెడుతోంది. అనేక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేసుకుంటున్నాయి. ఏళ్ల తరబడి వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ ఇటీవల 14 మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి ఆమోదం తెలిపింది. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ముందుచూపుతో పురుడు పోసుకున్న మాస్టర్ ప్లాన్ రోడ్లు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఆర్టీసీ బస్టాండ్ ఎమ్మెస్ సుబ్బులక్ష్మి కూడలి నుంచి చింతల చేను మీదుగా హీరో హోండా షోరూం రైల్వే గేట్ వరకు 80 అడుగుల మాస్టర్ రోడ్డుకు శ్రీకారం చుట్టారు. ఆరు నెలల్లోనే పూర్తి చేశారు. ఎమ్మెల్యే భూమన పుట్టినరోజు సందర్భంగా సోమవారం ప్రజలకు అంకితం చేయనున్నారు. ఈ రోడ్డుతో ఆర్టీసీ బస్టాండ్‌కు తూర్పు వైపున ఉన్న భూముల ధరలకు రెక్కలు వచ్చాయి.

రూ.6.3 కోట్లతో రోడ్డు ఏర్పాటు

చింతల చేను మాస్టల్ ప్లాన్ రోడ్డును 80 అడుగుల వెడల్పుతో 1.5 కిలోమీటర్ల మేర చేపట్టారు. దీని కోసం మున్సిపల్ కార్పొరేషన్ రూ.6.3 కోట్లు ఖర్చు చేసింది. రోడ్డు మధ్యలో డివైడర్ స్మూత్ లైటింగ్‌తో పాటు రోడ్డుకు ఇరువైపులా పచ్చదనాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకున్నారు.

అభివృద్ధే మా అజెండా



తిరుపతి నగర అభివృద్ధే అజెండాగా పనిచేస్తున్నాం. తిరుపతి నగర తూర్పు ప్రాంతం ఇప్పటివరకు అభివృద్ధికి నోచుకోలేదు. నగరం ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుంది. విస్తరణ జరిగితే ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడంతో పాటు అభివృద్ధి మరింత పరుగులు పెడుతుంది. నగరానికి కనెక్టివిటీ పెంచడం, తూర్పు ప్రాంతాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టించడం, ట్రాఫిక్ సమస్యను అధిగమించడమే లక్ష్యంగా మాస్టర్ ప్లాన్ రోడ్లను ఏర్పాటుచేస్తున్నాం.

–భూమన కరుణాకర రెడ్డి, ఎమ్మెల్యే,తిరుపతి

అనుకున్న సమయానికి రోడ్లు పూర్తి



అన్నమయ్య మార్గ్, డీబీఆర్–డాక్టర్ వైఎస్ఆర్ మార్గ్ రోడ్లు నగరవాసులకు ఎంతో ఉపశమనాన్ని కలిగించాయి. ఈ ఫలితాలను దృష్టిలో ఉంచుకుని ఏకకాలంలో 14 మాస్టర్ పాన్ రోడ్లను అభివృద్ధి చేయాలని సంకల్పించాం. ఈ క్రమంలోని చింతల చేను మాస్టర్ రోడ్డును అత్యంత సుందరంగా అతి తక్కువ కాలంలో నిర్మించి అందుబాటులోకి తీసుకొస్తున్నాం. సోమవారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీషతో కలిసి ప్రారంభించనున్నాం.

– భూమన అభినయ్‌రెడ్డి, డిప్యూటీ మేయర్, తిరుపతి

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న కళాకారులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తిరుచానూరుకు చెందిన ఉమశ్రీ బృందం కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. పుష్పాంజలి, మూషికవాహన, శాంతాకారం, శివతాండవం, శంభో శివ శంభో, ఘల్లుఘల్లు, ముద్దుగారే యశోద, ఓం శివోహం, జగడపు జగముల, గణనాయక, ఏరువాక, శ్రీమన్నారాయణ వంటి పాటలకు కళాకారులు భూమిజ, లపీష, భవిష్య, దీక్షిత, శ్రేష్ఠ, రిషిత, వర్ష, లక్షయ, భావిష చక్కగా నాట్యం చేశారు. వారిని ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

రోడ్డు నియమాలు పాటించాలి

భాకరాపేట: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు నియమాలు పాటించాలని భాకరాపేట ఎస్ఐ ప్రకాష్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం భాకరాపేటలో ఆటో డ్రైవర్లకు రోడ్డు నియమాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని తెలిపారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడరాదని పేర్కొన్నారు. నియమాలు పాటించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరగవని తెలిపారు.

డ్వాక్రా బజార్‌ను సందర్శించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి



వస్తువులను కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, సెర్ప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అఖిల భారత డ్వాక్రా బజారును ఆదివారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సందర్శించారు. దుకాణాలను పరిశీలించారు. తనకు నచ్చిన కాటన్ దుస్తులు, ఆయుర్వేద ఔషధాలు, చెక్క బొమ్మలను కొనుగోలు చేశారు. ఏపీతో పాటు మరో ఐదు రాష్ట్రాల నుంచి వచ్చిన విక్రయదారులతో మాట్లాడారు. డీఆర్‌డీఏ ఏపీడీ ప్రభావతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



దీవించమ్మా.. గంగమ్మా



పదో తరగతి విద్యార్థులు సోమవారం నుంచి పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. తమకు విజయం కలిగించాలని కోరుతూ వారు తిరుపతి తాతయ్యగుంట గంగమ్మను ప్రార్థించారు. అమ్మవారి వద్ద హాల్ టికెట్లు పెట్టి పూజలు చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

- పరీక్షలు రాయనున్న విద్యార్థుల సంఖ్య 495

పాకాల: మండలంలో సోమవారం నుంచి పదో పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఎంఈవో బాబ్జీ తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ మండలంలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏ, బీ సెంటర్లు, దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌లో ఒక సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 495 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించామని, పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశామన్నారు.

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో శెట్టిపల్లి విలీనం

- మంగళం హెడ్‌క్వార్టర్‌గా నాలుగు గ్రామాలు
- కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి వెల్లడి

తిరుపతి అర్బన్: తిరుపతి అర్బన్‌లో కొంత భాగం, తిరుపతి రూరల్‌లో కొంతభాగంగా ఉన్న శెట్టిపల్లి పంచాయతీని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ చేసినట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శెట్టిపల్లి పంచాయతీలోని శెట్టిపల్లి, శెట్టిపల్లి హరిజనవాడ, సీఆర్ఎస్ క్వార్టర్స్, ఉప్పరపాళెం, వినాయకనగర్ ప్రాంతాలు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వచ్చాయి. ఇప్పటికే తిరుపతి కార్పొరేషన్‌లో 50 డివిజన్లు ఉన్నాయి. శెట్టిపల్లిని మరో డివిజన్‌గా చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు మంగళం హెడ్ క్వార్టర్‌గా మిట్ట గాంధీపురం, మిట్టగాంధీపురం హరిజనవాడ, చెన్నాయగుంట ప్రాంతాలతో పంచాయతీగా ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక ప్రజలకు సౌకర్యవంతంగా ఉండడంతో అధికారుల ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం సానుకూలంగా ఉత్తర్వులు ఇచ్చినట్టు సమాచారం. ఎన్నో ఏళ్ల కల నెరవేరడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

పుష్ప సోయగం





విరబూసిన పుష్పాల వద్ద ఆనందంగా ఫొటోలు తీసుకుంటున్న భక్తులు





తిరుమలలోని పలు ప్రాంతాలలో భక్తులను కనువిందు చేస్తున్న పుష్పాలు

కలియుగ వైకుంఠం తిరుమలలోని ప్రతి వస్తువు, చెట్టు, చేమల్లోనూ ఆధ్యాత్మికత ఉట్టిపడుతుంది. ఇక్కడున్న పలు చెట్లు ఆకులు రాలిపోయి కొత్త చిగుర్లు వేశాయి. కొన్ని నిండుగా పూలతో పరిమళాలను వెదజల్లుతున్నాయి. రోడ్ల పక్కన, నందన వనాల్లో ఉన్న చెట్లు పూలతో నూతన శోభను సంతరించుకుని హొయలుపోతున్నాయి. వాటిని చూసి భక్తులు తన్మయత్వం చెందుతున్నారు. కొందరు సెల్ఫీలు, ఫొటోలు తీసుకుని మురిసిపోతున్నారు.

–తిరుమల